‘బెల్ట్’ దందా.. ఆపే దమ్ముందా!

- జిల్లాలో ఏరులైపారుతున్న మద్యం
- రాత్రివేళ మందుబాబుల హల్‌చల్
- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు



కౌటాలలోని వైన్స్ నుంచి బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్న నిర్వాహకులు

కౌటాల: జిల్లాలో బెల్టుదందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల సమీపంలో, ప్రధాన రహదారుల వెంట, ఆలయాల సమీపంలో ఇలా పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు వెలిశాయి. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యంబాబుల ఆగడాలు తట్టుకోలేక బెల్ట్‌షాపులు ఎత్తివేయాలని ఏకంగా మహిళలు రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 85 షాపులపై దాడి చేసి 85 మందిపై కేసు నమోదు చేశారు. రూ.2,86,627 విలువ గల 260.57 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు అబ్కారీ శాఖ అధికారులు తెలిపారు.

అంతటా మత్తు..!

జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ పట్టణం, ఆయా మండల కేంద్రాల్లో ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైన్స్‌ల యజమానులే గొలుసు(బెల్ట్‌షాప్) దందాను ప్రోత్సహిస్తున్నారు. ముడుపులు ముట్టడంతో సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలున్నాయి. జిల్లాలో 32 మద్యం దుకాణాలు 3బార్లు ఉన్నాయి. ఏటా రూ.200 కోట్ల పైచిలుకు సరుకు అమ్ముడవుతోంది. మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా వాటి సంఖ్య 900లకు పైగా ఉన్నాయి. సమీప వైన్స్‌లలో కొనుగోలు చేసిన మద్యం సీసాలను అధిక ధరలకు ఇక్కడ విక్రయిస్తున్నారు. రహదారుల పక్కనే ఉన్న వాటిలో మందు నిరంతరం లభిస్తుండడంతో వాహనదారులు తాగి నడపడం.. ఫలితంగా రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కౌటాల, వాంకిడి, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో వెలిసిన బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

రోడ్లపైనే తాగుతూ..

కొన్నిచోట్ల మందుబాబులు ఫుల్లుగా మద్యం తాగి వాహనదారులు.. పాదచారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు. కొందరు మందుబాబులు మద్యం మత్తులో గొడవ పడటం, వచ్చిపోయే వారిని వేధింపులకు గురిచేయడం వంటి సంఘటనలు జిల్లాలో నిత్యకృత్యమయ్యాయి. ప్రధాన రహదారులపై ఉన్న వైన్స్‌ల సమీపంలో రహదారులపై మందుబాబులు సీసాలు పెట్టుకుని తాగుతున్నా అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిసార్లు అధికారులు బైండోవర్ చేస్తున్నా బెల్టు దందాకు అడ్డుకట్ట పడడం లేదు. ప్రధానంగా కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారి వెంబడి కౌటాల నుంచి గురుడుపేట గ్రామం వరకు గల కల్వర్టులపై మందుబాబులు గుంపులుగా మద్యం సేవిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యపాన నిషేధానికి తీర్మానం

బెజ్జూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లి(బి) గ్రామంలో మద్యపానం నిషేధానికి పోలీసులు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు సహకరించాలని గ్రామస్తులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 8వ తేదీన బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నాటుసారా, మద్యం అధికంగా విక్రయిస్తుండడంతో మద్యానికి బానిసై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మద్యపాన నిషేధంతోనే గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.


వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

బెల్ట్‌షాపులు తొలగించాలని ఆందోళన


కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై మహిళల ఆందోళన (ఫైల్)

కాగజ్‌నగర్ పట్టణానికి సమీపంలోని కోసిని గ్రామ పంచాయతీ పరిధిలో అన్ని బెల్ట్‌షాపులను మూసి వేయాలని మహిళలు డిమాండ్ చేశారు. గత నెల 24న బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపుల కారణంగా గ్రామంలో మద్యం ఏరులై పారుతుందని, యువత మద్యానికి బానిసలవుతున్నారని వాపోయారు. బెల్ట్‌షాపులను తొలగించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తనిఖీలు చేస్తున్నాం..



అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 85 మందిపై కేసులు నమోదు చేశాం. దేశీదారు విక్రయిస్తున్న వారిపై సిబ్బందితో తనిఖీలు చేయిస్తాం. నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. వైన్స్‌ల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– వి. రవి, ఎక్సైజ్‌శాఖ సీఐ, కాగజ్‌నగర్

చిరు వ్యాపారుల కడుపు కొట్టొద్దు


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారులు కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని, వారి కడుపు కొట్టొద్దని గ్రామ యువకులు కోరారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శి పేదం తుకారాంకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ అధికారులు దుకాణాలను ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తుండటంతో వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఒకవేల దుకాణాలు ఖాళీ చేయిస్తే స్థలాలు కేటాయించాలని కోరారు. మాజీ వార్డు సభ్యులు షౌకత్ అలీఖాన్, ఇగురపు వెంకటేశ్, గుమ్ముల శ్రీనివాస్, గౌత్రే శంకర్, కుమ్మరి శంకర్, సమీర్ పాల్గొన్నారు.

జోడేఘాట్‌లో పిచ్చి మొక్కలు తొలగింపు


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న కుమురం భీం 84వ వర్ధంతి నేపథ్యంలో మంగళవారం ఉపాధిహామీ కూలీలు పిచ్చి మొక్కలు తొలగించారు. సభాస్థలి, మ్యూజియం వెనుక భాగంలో, స్మృతివనం, బొటానికల్ గార్డెన్‌స్థలం, నర్సరీ క్షేత్రం, సమావేశం స్టేజి, కుమురం సూరు ప్రతిమ వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు.

క్లుప్తంగా

పెసా ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి

కెరమెరి: ఏజెన్సీలోని మండలాల్లో పెసా చట్టం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, పెసా మండలాధ్యక్షుడు మడావి భరత్ భూషణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలను ముందుగా ఎంపిక చేయాలని, ఆ తర్వాతే గిరిజనేతరుల ఎంపిక జరగాలన్నారు. ఆయన వెంట పెసా మొబలైజర్లు సెడ్మకి తుకారాం, ఆడ ఆనంద్‌రావు, కుర్సెంగ యాదవ్‌రావు తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

కాగజ్‌నగర్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని సాయితేజ, వివేకానంద, వసుంధర డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సాయితేజ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనూక్, వసుంధర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిరట్‌కార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఉద్యోగాల పేరిట అక్రమ వసూళ్లు’

ఆసిఫాబాద్‌అర్బన్: ఉద్యోగాలు ఇప్పిస్తామని కొన్ని ఏజెన్సీలు, దళారులు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. చిరంజీవి మాట్లాడుతూ కొంతకాలంగా డీఎంహెచ్‌వో, హెచ్‌వో, మెడికల్ కళాశాల నుంచి విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలతో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా చేపడుతున్న నియామకాలపై విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

‘గమ్యం యాప్ వినియోగించుకోవాలి’

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు గమ్యం యాప్ వినియోగించుకోవాలని ఏడీసీ శంకర్, ఏడీసీ సేఫ్టీ వార్డెన్ పోచం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులు తమ ఫోన్లలో గమ్యం యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. బస్సు నంబర్ ద్వారా లొకేషన్ తెలుసుకునే వీలుందని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

కౌటాల: మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను మంగళవారం నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రఘునాథ్, నాగరాజ్‌లు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని కనికి, తలోడి, వీరవెల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులు, ఐకేపీ ఆధ్వర్యంలో చేసిన పనులను వారు పరిశీలించారు. అలాగే ఆయా పనుల రికార్డులను పరిశీలించి గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను ఉపాధిహామీ కూలీలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పిస్తున్నారా.. సకాలంలో కూలీ డబ్బులు చెల్లిస్తున్నారా అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలి పారు. ఎంపీడీవో కోట ప్రసాద్, ఏపీఎం ముక్తేశ్వర్, ఈసీ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆసిఫాబాద్‌అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ సతీశ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8వ తేదీన అనారోగ్యంతో బాధపడుతున్న 70 సంవత్సరాలు గల గుర్తు తెలియని వృద్ధుడిని 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అదేరోజు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించగా సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ పేర్కొన్నారు. వృద్ధుడి ఒంటిపై లేత గోధుమ రంగు గల గీతల షర్ట్ ధరించి ఉన్నారని, మృతుడి దేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. వివరాలు ఎవరికైనా తెలిస్తే 87126 70506, 87126 70569కు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం యూనిట్ అధ్యక్షుడు రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్ణాగౌడ్‌లు మాట్లాడుతూ మహానీయుని అడుగుజాడల్లో ప్రతిఒక్కరు నడుస్తూ ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిరాజుల్ హక్, కనకమ్మ, కిష్టయ్య, లింగయ్య, అచ్యుత్, వెంకటయ్య, పద్మ, పోచన్న, వెంకటేశ్, దండనాయకుల రామారావు, రామస్వామి, నర్సయ్య, వినోద్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: కౌటాల మండలంలోని ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి ఎంఈవో గావుడే హన్మంతు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం అబ్దుల్ కలాం ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో విద్యార్థులు నడవాలన్నారు.


అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం జంగు మంగళవారం తెలి పారు. ఇటీవల రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో నందిని, నాగేశ్వరి, వైష్ణవి, సరోజ, జూనియర్ విభాగంలో సోని, జంగుబాయి సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నా రు. వీరు తమిళనాడులో ఈ నెల 16, 17 తేదీ ల్లో జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో తెలంగాణ రాష్ట్ర తరుపున ఆడతారని తెలిపారు. విద్యార్థినులను డీటీడీవో రమాదేవి, డీఎస్‌వో మీనారెడ్డి అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు శైలజ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన శైలజ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు డీఎస్‌వో మీనారెడి, హెచ్‌ఎం జంగు మంగళవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ విభాగంలో జావెలిన్‌త్రోలో శైలజ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి గుంటూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇస్తున్న కోచ్ విద్యాసాగర్‌ను డీటీడీవో రమాదేవి, డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్ అభినందించారు.



కోచ్ విద్యాసాగర్‌తో శైలజ

హద్దులు దాటిన ఆకతాయితనం

- బెండార పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు
- బీర్లు తాగి తరగతి గదిలో మూత్రం పోసిన వైనం
- తలుపులు, బెంచీలు, వాటర్‌పైపులు ధ్వంసం
- దసరా సెలవుల్లో ఘటన


తొలగించిన నల్లాలు

వాంకిడి: పేద పిల్లల భవిష్యత్తుకు పునాదులు దిద్దే ప్రభుత్వ పాఠశాలలో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. గ్రామ బడి అభివృద్ధికి అండగా నిలవాల్సింది పోయి పాఠశాలలో సమస్యలు సృష్టిస్తున్నారు. మండలంలోని బెండార గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కొందరు గుర్తు తెలియని ఆకతాయిలు దసరా సెలవు దినాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. పాఠశాల భవనంలో మద్యం తాగి, విందు చేసుకుని వస్తువులు ధ్వంసం చేశారు. సోమవారం దసరా సెలవులు ముగియడంతో మంగళవారం నుంచి బడులు తెరుచుకున్నాయి. దీంతో ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఆవరణలో, తరగతి గదుల్లో వస్తువులు ధ్వంసమై ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు.

వస్తువులు ధ్వంసం..

కొందరు ఆకతాయిలు దసరా సెలవు దినాల్లో పాఠశాలలోకి ప్రవేశించి ఇష్టారీతిగా వ్యవహరించారు. బోరు నుంచి ట్యాంకుకు అక్కడి నుంచి నల్లాలకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను పూర్తిగా ధ్వంసం చేసి నల్లాలు తీసేశారు. టైల్స్ పగలగొట్టారు. ఇనుప రాడ్లతో తలుపులు బద్దలు కొట్టి తరగతి గదిలోకి వెళ్లి ఫ్యాను, విద్యుత్ లైట్లు ధ్వంసం చేశారు. టేబుల్ కింద పడేసి, కుర్చీ విరగ్గొట్టారు. విద్యుత్ తీగలు సైతం తెంచేందుకు ప్రయత్నించారు. పాఠశాలలోనే ఉన్న పాఠ్య పుస్తకాలను చింపేసి పడేశారు. పాఠశాల ఆవరణలోనే బీరు సీసా, దావత్ చేసుకున్నట్లు పేపర్ ప్లేట్లు ఉండటంతో తాగిన మత్తులోనే ఇలా చేసినట్లు తెలుస్తోంది. మద్యం సేవించిన మైకంలో తరగతి గదుల్లోనే మూత్రం పోసినట్లు ఆనవాళ్లను ఉపాధ్యాయులు గుర్తించారు. హెచ్‌ఎం ఫిర్యాదుతో ఏఎస్సై పోషెట్టి పాఠశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.


ధ్వంసమైన ఫ్యాను


విరగ్గొట్టిన కుర్చీ, పక్కనే మూత్రం పోసిన ఆనవాళ్లు

గతంలోనూ పలు ఘటనలు..

బెండార ప్రాథమిక పాఠశాలలో గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నట్లు సమాచారం. పాఠశాలలో రాళ్లు విసరడం, రాత్రివేళ పేకాట ఆడటం వంటివి జరిగినట్లు తెలుస్తోంది. సద్దుల బతుకమ్మ రోజున రాత్రి కొందరు గ్రామంలోని ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారిలో కొందరు మైనర్లు కూడా ఉన్నట్లు సమాచారం. గ్రామంలోని కొందరు ఆకతాయిలు స్కూల్ పిల్లలకు చెడు వ్యసనాలు అలవాటు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పూర్తిగా ధ్వంసం చేశారు..



దసరా సెలవుల తర్వాత మంగళవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉదయాన్నే పాఠశాల తలుపులు తెరవగా పరిస్థితి గందరగోళంగా కన్పించింది. తరగతి గదులన్నీ పరిశీలించగా చాలా వస్తువులు ధ్వంసమయ్యాయి. మద్యం సీసాలు, భోజనాలు చేసిన పేపర్ ప్లేట్లు ఆవరణలో ఉన్నాయి. విద్యా బోధన జరిగే చోట అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడటం సరికాదు.

– శ్రీనివాస్, హెచ్‌ఎం

సంక్షిప్త వార్తలు

పరీక్ష ఫీజు గడువు పెంపు

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు సెమిస్టర్ 2 పరీక్ష ఫీజు చెల్లించడానికి యూనివర్సిటీ గడువు తేదీని పెంచిందని కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. రూ. 100ల జరిమానాతో ఈనెల 20వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సహాయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలిగా శైలజ

కౌటాల: సహాయ ఫౌండేషన్ కుమురం భీం జిల్లా అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన బండి శైలజాగౌడ్‌ను ఎన్నుకున్నారు. సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టంకరి శివప్రసాద్‌యాదవ్, సంఘం ఆధ్యాత్మిక గౌరవ అధ్యక్షులు ఆదిత్య పరాశ్రీ స్వామి తనను జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కాగజ్‌నగర్‌రూరల్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి విజయ్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 14 వరకు జరిగే కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘కుల గణన హర్షనీయం’

వాంకిడి: రాష్ట్ర ప్రభుత్వం కుల గణనకు జీవో విడుదల చేయడం హర్షనీయమని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎనగంటి ప్రవీణ్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఖమాన గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితంగా ప్రభుత్వం స్పందించడం గొప్ప విషయమన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కులగణన విషయంపై అవహేళనగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. నాయకులు బ్రహ్మయ్య, రాజేశ్, సురేశ్, భక్తరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రత్యేక తెలంగాణ తొలి, మలి ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో ఉద్యమకారులు ఎంతో నష్టపోయారని, వారిని ఆదుకోవాలని సూచించారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రిజర్వేషన్లు కల్పించి ఉద్యమకారులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు నారాయణ, రమణయ్య, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, ఫారూఖ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు పట్టివేత

వాంకిడి: అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.2.20 లక్షల విలువ గల నిషేధిత పొగాకు సంచులను పట్టుకున్నట్లు ఏఎస్సై పోషెట్టి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సయ్యద్ ముస్తఫా అనే వ్యక్తి కారులో పొగాకును మహారాష్ట్రకు తరలిస్తుండగా మంగళవారం రాత్రి మండల కేంద్రంలో పట్టుకున్నట్లు తెలిపారు. కారులో హోల హుక్కా పేరుతో రూ.82 వేల విలువ గల ప్యాకెట్లు, ఈగల్ పేరుతో రూ.138240 విలువ గల ప్యాకెట్లు ఉండగా స్వాధీనం చేసుకుని, సయ్యద్ ముస్తఫా, కారు డ్రైవర్ చంద్రకాంత్‌లను అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఏఈకి సన్మానం

కౌటాల: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని కౌటాల విద్యుత్‌శాఖ ఏడీ రాజేశ్వర్ అన్నారు. బదిలీపై వెళ్లిన కౌటాల విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్‌ను మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహించిన అకింతభావంలో పని చేయాలన్నారు. కౌటాల సబ్‌స్టేషన్‌లో కొత్త బూస్టర్ పీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ అందిస్తామని తెలిపారు. సబ్ ఇంజనీర్ అజయ్, ఫోర్‌మెన్ రమేశ్, సిబ్బంది మాధవ్, చరణ్‌దాస్, సుధాకర్ పాల్గొన్నారు.

అటవీభూమి స్వాధీనం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా గ్రామశివారులోని కంపార్టుమెంట్ నెం.129లో గల భూమిలో కొందరు రైతులు కంది పంటను సాగు చేయగా, మంగళవారం అటవీశాఖ అధికారులు కంది మొక్కలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆరు ఎకరాల భూమిలో గతంలో ప్లాంటేషన్ నిర్వహించామని, కొంతమంది కందిపంట సాగు చేయగా తొలగించినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో శశిధర్‌బాబు తెలిపారు. ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు బేసిక్‌పే అమలు చేయాలి

రెబ్బెన: ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నా విజయవంతం చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 17,541 మంది ఉద్యోగులు 78 రకాల క్యాడర్లలో పని చేస్తున్నారన్నారు. వారందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2వ ఏఎన్‌ఎంలు ప్రమీల, పద్మ, సునీత, విజయలక్ష్మి, తులసీ, వనిత, శ్రీవిద్య, రుచిత, మృదుల్ మండల్ పాల్గొన్నారు.